

రేపు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రాక!

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా. ధనంజయ వై. చంద్రచూడ్ 28, 29 తేదీలలో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న శనివారం సాయంత్రం 5.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకొని రాత్రి బస చేసి, మరుసటి దినం ఆదివారం ఉదయం 8:15 గంటలకు తిరుమల చేరుకొని, తిరుమల శ్రీవారిని దర్శించుకొని మధ్యాహ్నం తిరుగు ప్రయాణం కానున్నారు.

రోగుల్లారా.. రాకండి..!

ప్రజాశక్తి ఎక్స్‌క్లూజివ్ 3

మూర్ఛ వ్యాధిగ్రస్తుల పట్ల అమానవీయ ప్రవర్తన

స్విమ్స్‌లో ఎపిలెప్సీ బాధితుల దుస్థితి

నెలలో మూడో ఆదివారం మందులు ఇవ్వలేమని చెప్పడంతో మూర్ఛవ్యాధిగ్రస్తుల నిరసన (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- తిరుపతి

రాయలసీమలో వైద్యరంగానికే తలమానికమైన స్విమ్స్ క్రమేపీ తన సేవా కార్యక్రమాలకు తిలోదకాలిస్తోంది. 'మానవసేవే మాధవసేవ' అని నిత్యం ప్రచారం చేసే టిటిడి నిధులతో నడుస్తున్న ఆసుపత్రిలో కొంచెమైనా మానవత్వం కానరావడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూర్ఛరోగులారా... ఇకపై రావద్దు అంటూ సిబ్బంది పరుష పదజాలంతో దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ రోగులు పెదవి విరుస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఎపిలెప్సీ క్యాంపులను నిర్వహించడం భారంగా భావిస్తూ ఉచితంగా ఇస్తున్న మందుల్లోనూ రోజురోజుకీ కోత విధిస్తుండటం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సుమారు రెండుదశాబ్దాల క్రితం డా॥ సూర్యప్రకాష్‌రావు డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచి స్విమ్స్‌లో ప్రతినెలా 3వ ఆదివారం ఎపిలెప్సీ(మూర్ఛరోగుల) క్యాంపును ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్విమ్స్ న్యూరాలజీ ప్రొఫెసర్ వెంగమ్మ ఆధ్వర్యంలో ప్రారంభమైన క్యాంపులో రోగులకు ఉచిత వైద్యం, మందులనూ అందించారు. ప్రస్తుతం ఎపిలెప్సీ క్యాంపు నెలలో ఓపీలు 1000 కు పైగా చేరినట్లు న్యూరాలజీ వైద్యులే చెబుతున్నారు. చిత్తూరు, నెల్లూరు, కడప, ప్రకాశం ఉమ్మడి జిల్లాలకు చెందిన 1 లక్ష మందికి పైగా మూర్ఛరోగులు క్యాంపులో చికిత్స పొందినట్లు స్విమ్స్ వర్గాలే పేర్కొంటున్నాయి. గతంలో నెలకు ఉచిత మందులకోసం రూ. 2 లక్షలు వెచ్చిస్తుంటే ప్రస్తుతం అందులో సగం కూడా ఇవ్వక పోవడం శోచనీయం.

స్విమ్స్ ప్రాణదాన, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని స్కీముల్లో కోట్లాదిరూపాయల నిధులున్నప్పటికీ బడ్జెట్ లేదన్న కుంటిసాకులతో ఓపీలను సగానికి కుదించాలని యాజమాన్యం నిర్ణయించినట్లు సమాచారం. దీంతో గత నాలుగైదు ఏళ్ల నుంచి వస్తున్న మూర్ఛరోగులను మాత్రమే క్యాంపునకు రావాలంటూ అధికారులు చెబుతుండటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతుండటం గమనార్హం. పాతవాళ్లు ఎవరైనా మందుల కోసం వస్తే ' ఇంకా ఎన్నాళ్లు తింటారు ఉచిత మందులు. ఒక ఇంట్లో ఇద్దరు ముగ్గురు రోగులున్నా వారందరికి ఇచ్చేదానికి ఇదేమీ అన్న సంతర్పణ కాదు.' అంటూ చీదరించుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. పైగా ఇటీవలే ఈ మూడో ఆదివారం 550 మంది రోగులు నాలుగైదు జిల్లాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి స్విమ్స్‌కు మందుల కోసం వచ్చారు. అయితే స్విమ్స్‌లో డాక్టర్లు వారి సమస్య పరిష్కారానికి నిరసన కార్యక్రమంలో ఉన్నారు. - ఈ నెల మందులు ఇవ్వ లేదు..తిరిగి వెళ్లండి అంటూ హుకుం జారీ చేశారు. ' ఆందోళనలో ఉన్నది డాక్టర్లే కదా...నర్సులు, సిబ్బంది అందరూ విధుల్లోనే కదా ఉన్నారు. వారి ద్వారా అయినా మందులు ఇప్పించండి ' అంటూ ప్రాధేయపడినా పట్టించుకోకపోవడంతో బాధితులు ప్రజాసంఘాల నేత టి.సుబ్రమణ్యంను ఆశ్రయించారు. దీంతో ప్రజాసంఘాల నాయకులు స్విమ్స్ ఎదుట ఆందోళన చేపట్టడంతో స్విమ్స్ యాజమాన్యం స్పందించక తప్పలేదు. ఎట్టకేలకు రోగులకు మందులిచ్చి పంపారు. అయితే బాధితులు తరచూ తమకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు, ఛీత్కారాలు, అవమానాలను వారికి చెప్పి గోడువెళ్ళబోసుకున్నారు. దీంతో అక్కడిక్కడే బాధితుల తరఫున పోరాడేందుకు స్విమ్స్ ఎపిలెప్సీ రోగుల సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

క్యాంపును సమగ్రంగా కొనసాగించాల్సిందే : టి సుబ్రమణ్యం, సిపిఎం నగర కార్యదర్శి

రాయలసీమలోని మూర్ఛరోగులకు ఆదరువుగా ఉన్న ఎపిలెప్సీ క్యాంపును స్విమ్స్ గతంలో నిర్వహిస్తున్నట్లుగానే సమగ్రంగా కొనసాగించాల్సిందే. శ్రీవారి భక్తుల తర్వాత వైద్యం, విద్యకే టిటిడి నిధుల్ని ఉపయోగిస్తోంది. వేల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న టిటిడి స్విమ్స్ ఎపిలెప్సీ క్యాంపును కొనసాగించడం సమస్యకాదు. అయితే నిధుల కొరతంటూ కుంటిసాకులు చెప్పడం సబబు కాదు.రోగులకు ఉచిత వైద్యం, మందులతో పాటు భోజన సదుపాయాన్ని కల్పించాలి. రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

రోగులకు మందులివ్వాలి : మురళి, మూర్ఛరోగి

గతంలో ఉచితంగానే మందులిచ్చారు. స్విమ్స్‌లో ఇప్పుడు చాలా బాగా పనిచేస్తున్నాయని మేమంతా బలంగా నమ్ముతున్నాం. మాలాంటి పేదోళ్లకి వెంకన్నస్వామి ఖర్చుపెట్టి మందులు ఇస్తే పోయేదేముంది. స్విమ్స్ అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి. స్విమ్స్‌కు నెలకు 2 లక్షల రూపాయల్ని పేద మూర్ఛరోగుల కోసం ఖర్చుచేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉందా?. కానీ అధికారుల మొండితనంతో మూర్ఛరోగుల్ని ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదు. మా పట్ల అమానవీయంగా, చీత్కారంగా మాట్లాడుతూ ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా వారి తీరు మార్చుకోవాలి.

వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనలు తిలకిస్తున్న కమిషనర్

'స్వచ్ఛత హి సేవ' 3కె రన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన 3కె రన్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ 3కె రన్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య జెండా ఊపి ప్రారంభించారు. వివేకానంద కూడలి నుండి ప్రారంభమై టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ మీదుగా ఎస్.వి.యూనివర్సిటీ వరకు ఈ 3కె రన్ పరుగు పందెంలో పెద్దసంఖ్యలో యువత పాల్గొంది. ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కోసం స్వచ్ఛత హి సేవ లో భాగంగా గత పది రోజులుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. పరిశుభ్ర నగరంగా తిరుపతిని దేశంలో నెంబర్ వన్ గా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు చెత్త పన్ను ను రద్దు చేశారని అన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ మ్యాప్ మై ఇండియా యాప్‌ను ప్రజలందరూ డౌన్లోడ్ చేసుకుని పారిశుద్ధ్య సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ఆకట్టుకున్న వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనలు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్, వేస్ట్ టు వండర్ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని పనికిరాని వాటితో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్మికుల సంక్షేమానికి కృషి

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ సహకరిస్తామని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఇండోర్ స్టేడియంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, పిపిఇ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జిల్లా వైద్య ఆరోగ్యాశాఖధికారి డాక్టర్ శ్రీహరి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

చంద్రబాబును కలిసిన రవినాయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికారత సంస్థ (శాప్) ఛైర్మన్‌గా నియమితులైన అనిమిని రవినాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో మర్యాదపూర్వకంగా గురువారం కలిసారు. క్రీడారంగంలో ఏపీని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలి : ఆర్‌పిఐ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలని ఆర్పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత, ఆదివాసి ఇతర పేద విద్యార్థిని విద్యార్థులు చదివే లక్ష్యంగా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో చేరుతున్న విద్యార్థులకు సరైన వసతులు లేని కారణంగా విద్యకు దూరమవుతున్నారన్నారు. అందుకు నిదర్శనమే గతంలో 60 శాతంగా ఉన్న హాస్టల్ విద్యార్థిని విద్యార్థుల సంఖ్య నేడు 40 శాతానికి పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేసి, రుచికరమైన భోజనముతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తగు నిర్ణయం తీసుకుని, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదన్నారు. ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్స్ ఛార్జీలను పెంచాలన్నారు. హాస్టళ్లను ప్రక్షాళన చేసి పేద, దళిత విద్యార్థులు చదువుకునేలా వీలు కల్పించాలన్నారు.

పోలేరమ్మ జాతరలో పోలీసుల అత్యుత్సాహం

దళిత యువకునిపై దాడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర పండగగా జరుగుతున్న తిరుపతి జిల్లా వెంకటగిరి పోలేరమ్మ జాతరలో కాంపాలానికి చెందిన లంకా చెంచు కుమార్‌ను విచక్షణారహితంగా దాడి చేసిన బెటాలియన్, సివిల్ పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న పోలేరమ్మ జాతరకు పలు ప్రాంతాల నుండి లక్షలాదిమంది భక్తులు హాజరవుతారు. వెంకటగిరి పట్టణానికి చెందిన కాంపాలెం ప్రాంతంలోని వందలాది మంది ప్రజలు ఉత్సాహంగా పోలేరమ్మను దర్శించుకోవడానికి తరలివస్తున్న సందర్భంగా లంకా చెంచు కుమార్ 'పీక' ఊదాడన్న నెపంతో పోలీసులు అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. శరీరం మొత్తం తీవ్ర రక్త గాయాలతో వెంకటగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ఓ దళిత యువకుని చుట్టుముట్టి విచక్షణారహితంగా రక్తం వచ్చేలా దాడి చేయడాన్ని ఖండించారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసులను సస్పెండ్ చేయాలి : సిపిఎం

బాధితుని పరామర్శిస్తున్న చెంగయ్య

ప్రకృతి వ్యవసాయంలో నిరంతర ఆదాయం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రకృతి వ్యవసాయంలో నిరంతర ఆదాయం వస్తుందని తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖం మాలి ప్రతినిధులకు తెలిపారు. రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అధ్యయనం చేయడానికి తిరుపతి మండలం వేమూరు గ్రామాన్ని గురువారం ఏడుగురు సభ్యులతో కూడిన మాలి ప్రతినిధులు బృందం సందర్శించింది. మాలి బృందంతో అయ్యప్పనాయుడు క్షేత్రంలో సమావేశం ఏర్పాటు చేసి తిరుపతి జిల్లలో పండించే పంటల వివరాలను తెలియజేశారు. జిల్లాలో 70 శాతం వరి, 10 శాతం వేరుశనగ, 10 శాతం మామిడి, 10 శాతం కూరగాయల పంటలను పండిస్తారని వివరించారు. ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 45 వేల మంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తునట్లు తెలిపారు. రైతు అయ్యప్పనాయుడు మాట్లాడుతూ తనకున్న 5 ఎకరాల పొలం మొత్తాన్ని గత 5 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, తనకు ప్రతి సంవత్సరం 6 లక్ష నుండి 7 లక్షల వరకూ ఆదాయం వస్తుందని వివరించారు. అనంతరం రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామచంద్రాపురం గ్రామంలో శ్రీ రామాలయం నందు మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, జిల్లా అడ్వైజర్ రవిచంద్ర ప్రసాద్ , అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ పట్టాభిరెడ్డి పాల్గొన్నారు .

'లెప్రసీ'పై క్షేత్రస్థాయి సర్వే: డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కుష్టి (లెప్రసీ) వ్యాధిపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని డి ఎం హెచ్ ఓ డాక్టర్ యు శ్రీహరి సూచించారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా కుష్టు ఎయిడ్స్, క్షయ నివారణ కార్యాలయము నందు జిల్లా లోని డిప్యూటి పారా మెడికల్ అధికారులు, లెప్రసి నోడల్ అధికారులకు మాసపు సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి పై క్షేత్ర స్థాయి లో సమగ్రముగా సర్వే నిర్వహించాలని తెలియజేసారు. ఈ సంవత్సరము జూలై 18 నుండి ఆగస్ట్ 10 వరకు జిల్లా లో జరిగిన కుష్టు వ్యాధి సర్వే లో ప్రతిభ ప్రదర్శించిన డిపి ఎమ్ఓలు, నోడల్ పర్సన్ లకు మొమెంటోలు సర్టిఫికెట్స్ ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రూప్ కుమార్, ఫిజియో థెరపిస్ట్ వెంకట రమణ పాల్గొన్నారు.

నితిన్ దంపతులకు సిఎం స్టాలిన్ ఆశీర్వాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నరువి ఆసుపత్రి వ్యవస్థాపకుడు జీవి సంపత్ కుమారుడు నితిన్ సంపత్ దంపతులను బుధవారం తన నివాసానికి ఆహ్వానించిన తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వారిని ఆశీర్వదించారు. నితిన్‌కు అడయార్ ఆనంద భవన్ ఎండీ కేటీ వెంకటేషన్ కుమార్తె అభిరామితో వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరు కాలేక పోయిన సీఎం, వారిని తన స్వగహానికి ఆహ్వానించి ఆశీర్వదించారు.

నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి దంపతులు

జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 25వ తేదీ బుధవారం నుంచి అక్టోబర్ 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్‌పి సుబ్బారాయుడు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు తిరుమలకు జగన్

తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో మాజీ సిఎం జగన్ శుక్రవారం సాయంత్రం తిరుమల పర్యటనకు రానున్నారు. శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అయితే జగన్ పర్యటన నేపథ్యంలో అలిపిరిలోనే జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పుంగనూరు నుంచి పాదయాత్ర

తిరుమల ప్రక్షాళన పేరుతో శుక్రవారం బిసివై వ్యవస్థాపకులు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. పుంగనూరులోని హనుమంతరాయదిన్నె వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆరంభ కార్యక్రమానికి నారాయణ రామానుజ జీయర్ స్వామి, మహంత్ కల్యాణ్‌దాస్ జీ మహరాజ్, పరిపూర్ణానంద స్వామీ తదితరులు హాజరుకానున్నారు. పుంగనూరు నుంచి అలిపిరి వరకూ పాదయాత్ర ద్వారా చేరుకుని అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరుకోనున్నారు. శుక్రవారం పుంగనూరులో ప్రారంభమైన పాదయాత్ర 30న ఉదయం 9.15 గంటలకు అలిపరి వద్దకు చేరుకుంటుంది.

తిరుమల ఘాట్ రోడ్డులో చిరుత సంచారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల నుండి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డు 26వ మలుపు వద్ద చిరుత పులి సంచరిస్తున్నట్లు శ్రీవారి భక్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మోటార్ బైకులపై తిరుమల నుండి తిరుపతికి వచ్చే స్థానికులు, యాత్రికులు అప్రమత్తంగా ప్రయాణం చేయాలని ఎస్వీఎన్పి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. కాలినడక మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా విజిలెన్స్, టిటిడి, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా భక్తులను గుంపులు గుంపులుగా వెళ్లేట్టుగా ఏర్పాట్లు చేశారు. ఇందుకుగాను 40 మంది అటవీ శాఖ సిబ్బంది భక్తుల రక్షణ కొరకు పర్యవేక్షణ చేస్తున్నారు.

'బోనుపల్లి'లో సమస్యలు 'బోల్డన్ని'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి(33 కేవీ/11 కేవీ) విద్యుత్ సబ్ స్టేషన్ బోల్డన్ని సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామాల్లో వెలుగులు నింపే విద్యుత్ సబ్‌స్టేషన్ అంధకారంలో మగ్గుతోందంటే విద్యుత్ అధికారుల శ్రద్ధ ఏమాత్రం ఉందో అర్థమవుతుంది. ప్రతినెలా రెండో శనివారం సబ్‌స్టేషన్‌లో నిర్వహించే మరమ్మతుల దినోత్సవాన్ని తూతూమంత్రంగానే జరుగుతుందన్న విమర్శలున్నాయి.

వేధిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ల కొరత

బోనుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ప్రస్తుతం ముగ్గురు షిఫ్ట్ ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా నలుగురు ఉండాల్సి ఉంది. అయితే ఒక షిఫ్ట్ ఆపరేటర్ రెండు నెలల కిందట వ్యక్తిగత కారణాల రీత్యా విధుల నుంచి వైదొలిగారు. దీంతో నలుగురు పనిని ముగ్గురే చేయాల్సి వస్తోంది. సాధారణంగా రోజుకు మూడు షిఫ్టుల్లో ఆపరేటర్లు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఒకరు సాధారణ డ్యూటీలో ఉండాలి. ఈ క్రమంలో సాధారణ డ్యూటీలో ఉండే ఆపరేటర్ ఏ, బీ షిఫ్టుల్లో పనిచేసే ఆపరేటర్లకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. అయితే సీ షిఫ్ట్ లో పనిచేసే ఆపరేటర్ వచ్చే సరికి ఆయన డ్యూటీ దిగేస్తుండడంతో రాత్రిళ్లు ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోందని షిఫ్ట్ ఆపరేటర్లు వాపోతున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్, సరఫరా వ్యవహారాలన్నీ నిత్యం ప్రమాదాలతో కూడుకున్నవే. బ్రేక్ డౌన్లు, షార్ట్ సర్క్యూట్ లు ఏర్పడ్డప్పుడు వాటిని సరిచేయడం కొన్నిసార్లు ఒక్కరి వల్ల సాధ్యపడే పరిస్థితి ఉండదు. ఇలాంటి సమయాల్లో కనీసం వాచ్‌మెన్ ఉన్నా సహాయకారిగా ఉంటాడు. కానీ సబ్ స్టేషన్లలో ప్రభుత్వం వాచ్మెన్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిపూట విధులు నిర్వహించే షిఫ్టు ఆపరేటర్లు భయం గుప్పెట్లో, ప్రాణాలు అరచేత పెట్టుకొని డ్యూటీలు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో సబ్ స్టేషన్ కు రక్షణ.. భద్రతా రెండూ కరువవుతున్నాయని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంధకారంలో విద్యుత్ సబ్‌స్టేషన్

మరమ్మతులకూ నోచని వైనం

శ్రీకాళహస్తి -కాళంగి ప్రధాన రోడ్డు మార్గంలో బోనుపల్లి(33 కేవీ/11 కేవీ) విద్యుత్ సబ్ స్టేషన్‌ను 2006లో ఏర్పాటు చేశారు. సుమారు 20 గ్రామాలకు ఇక్కడ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. సబ్ స్టేషన్ నిర్మించి సుమారు 20 ఏళ్ళు కావస్తున్నా దాని బాగోగులు మాత్రం మరిచారు. దీంతో ఆపరేటింగ్ భవనంతో పాటు బ్రేకర్లు, బ్రేకర్ బాక్సులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా బ్రేకర్లు తుప్పపట్టి తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదం జరిగి మంటలు వ్యాపిస్తే అదుపు చేసేందుకు కనీసం ఫైర్ సేఫ్టీ వ్యవస్థ కూడా లేదు. ఫైర్ సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన సీవోటూ సిలిండర్ తుప్పపట్టి శిథిలమైంది. ఇంతలా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న బోనుపల్లి సబ్ స్టేషన్ వైపు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సబ్ స్టేషన్ బాగోగులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'గంగ' కట్ట....వ్యర్థాల పుట్ట

ప్రజావక్తి - బిఎన్ కండ్రిగ

చెన్నయ్‌కి తెలుగుంగను తరలించేందుకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కాల్వను నిర్మిస్తే, పారిశ్రామికవేత్తలు పరిశ్రమల్లోని ప్రమాదకరమైన వ్యర్థాలను తరలించి కాల్వ కట్టను నింపేశారు. సత్యవేడు మండలంలోని చిన్నఈటిపాకం -అమాసరెడ్డికండ్రిగ మధ్య తెలుగుగంగ కాల్వ కట్టపై రాత్రిపూట గప్పుచిప్‌గా కొన్ని పరిశ్రమల్లోని వ్యర్థాలను తీసుకొచ్చి పడేసి చేతులు దులుపు కుంటున్నారు. పరిశ్రమల్లోని వ్యర్థాలను తరలించే కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్లు తెలుగుగంగ కాల్వ కట్టను డంపింగ్‌యార్డుగా మార్చేశారు. పరిశ్రమల యజమానులకు ఈ విషయం తెలిసినా కాంట్రాక్టర్లపై తోసేసి ఎంచక్కా పర్యావరణాన్ని కలుషితం చేసేస్తున్నారు. పరిశ్రమలనుంచి వచ్చే ప్రమాదకరమైన వ్యర్థాలను దూరంగా డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. అయితే కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్లు తెలుగుగంగ కాల్వ కట్టనే డంపింగ్‌యార్డుగా మార్చేయడం కొసమెరుపు. గతంలోనూ వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లోని అటవీ ప్రాంతంలో, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం రూరల్ మండల పరిధిలో ఇదే దారుణానికి పాల్పడుతుంటే విషం చిమ్మే వ్యర్థాలపై మీడియా బట్టబయలు చేసింది. స్పందించిన పరిశ్రమల యాజమాన్యం ఆరి కాంట్రాక్టును రద్దు చేశారు. ప్రస్తుతం వ్యర్థాలను తరలించే కాంట్రాక్టర్లు తెలుగుగంగ కాల్వ కట్టను డంపింగ్‌యార్డుగా మార్చేశారు. ఇకనైనా పర్యావరణ, పరిశ్రమల ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాల గుట్టలను తెలుగుగంగ కాల్వ గట్టలపైనుంచి తొలగించాలని పరీవాహక రైతులు, స్థానికులు కోరుతున్నారు. అధిక డోస్ కలిగిసన రసాయనాలు తెలుగుగంగ కాల్వలో కలిసి నీరు కలుషితమైతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యర్థాలు నియోజకవర్గంలోని పరిశ్రమల వర్థాలా? లేక సరిహద్దుల్లోని తమిళనాడు పరిశ్రమల వ్యర్థాలా అన్నది తేల్చాల్సి ఉంది. రెండు రోజుల క్రితమే తెలుగుగంగ కాల్వ ద్వారా కృష్ణా జలాలు సరిహద్దు ప్రాంతాన్ని తాకగానే గుమ్మడిపూండి ఎంఎల్ఎ కృష్ణమ్మకు పూజలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని వాలయానందపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు కొండా వెంకట మధుసూదన్ రావు జ్ఞాపకార్థం విద్యార్థులకు గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థితికి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సనత్ కుమార్, సంఘ సభ్యులు ఎస్వీ శ్రావణ్ కుమార్, బాలాజీ, కాశీ విశ్వేశ్వర శర్మ, జనార్ధన్, పవన్ కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ సిసి పియు ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మురళీ కృష్ణ, సుధాకర్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన మంజునాథ్ గౌడ్‌ను పలువురు నేతలు గురువారం ఘనంగా సత్కరించారు. ముందుగా టీఎన్టయూసీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు రావిళ్ళ మాధవనాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిఆర్ యుగంధర్, నాయకులు కృష్ణంరాజు, చీరల మోహన్, కన్నన్, జయచంద్ర, సుధా, రాజా తదితరులు కమిషనర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీధివిక్రయదారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తించారు. ఆ తరువాత ముస్లింమైనారిటీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రఫి అహ్మద్, గౌస్‌బాషా, చాను, సర్దార్, హమీద్‌బాషా, నజీర్, రఫి తదితరులు కమిషనర్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

మంచి అలవాట్లతో 'హృదయం' పదిలం

డాక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: మంచి ఆరోగ్యపు అలవాట్ల ద్వారా హృదయాన్ని పదిలం చేసుకోవచ్చని ప్రముఖ ఫిజిషియన్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.విజయ కుమార్ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని గురువా రం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ 'యంగ్ ఎట్ హార్ట్' కోసం ఆలోచించాల న్నారు. గుండెను జాగ్రత్తగా కాపాడుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రపంచంలో జపాన్, పారిస్‌లో గుండె జబ్బులు తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. గుండె జబ్బులు రాకుండా ఉండటానికి డాక్టర్ విజయకుమార్ కొన్ని సూచనలు తెలిపారు.

ఉచిత న్యాయంపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్ నాయక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉచిత న్యాయంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానిక శ్రీకాళహస్తి సబ్ జైలును తనిఖీ చేశారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హక్కులు-చట్టాలపై అవగాహన కల్పించారు. సొంత ఖర్చులతో న్యాయవాదిని సమకూర్చుకోలేని రిమాండ్ ఖైదీలకు న్యాయస్థానమే ఉచిత న్యాయం అందజేస్తుందని వివరించారు. అదెలాగో విశదీకరించి చెప్పారు. పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, కోర్ట్ సిబ్బంది, సబ్ జైలు సిబంది పాల్గొన్నారు.

పాండురంగకు నివాళి


నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

ప్రజాశక్తి-పిచ్చాటూరు: నారాయణవనం మండలం భీముని చెరువు గ్రామంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమ్ముడు కోనేటి పాండురంగ భౌతికకాయానికి మాజీ డిప్యూటీ సీఎం కే.నారాయణ స్వామి గురువారం నివాళులర్పించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కోనేటి సుమన్ కుమార్‌ను ఓదార్చారు.

జాబ్ మేళాలో 47మంది ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు ఐటీఐ కలశాల ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు వివిధ రంగాలకు చెందిన 4బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 93మంది యువతీ యువకులు పాల్గొనగా వివిధ కంపెనీల్లో 47మంది ఉద్యోగాలకు ఎంపికైయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, శ్రావణ్, ప్లేస్‌మెంట్ అధికారి గణేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దేటసయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సముచిత న్యాయం: ఎమ్మెల్యే భాను

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాను

ఎమ్మెల్యే విజయశ్రీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం వడమాలపేట మండలం ఓబిఆర్ కండ్రిగ పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

గూడూరు టౌన్: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బానిగి సాహెబ్ పేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, శివకుమార్, శ్రావణి రెడ్డి, రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని పిచ్చాటూరు గ్రామంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ సత్యవేడు నియోజక వర్గం కోఆర్డినేటర్ శ్రీపతి బాబు, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు ఇలంగోవ రెడ్డి, పద్దు రాజు, సుమంజలి, రవి, వాసు, చిన్న రాయల్, భక్త రెడ్డి, దొర వేలు, రవి రెడ్డి, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: టిడిపి మండల కన్వీనర్ బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో దీందార్లపవల్లి పంచాయితీలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ అలాగే రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులును తెలియజేస్తూ ఇంటింటికి గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో నాయకులు మౌలాలి, శివయ్య, ముండ్లపూరి శంఖర రెడ్డి, శంకర, క్రిష్ణా రెడ్డి, కంచం చిన్నబ్బోడు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయుడుపేట: ప్రజలు మెచ్చేలా ప్రభుత్వ పాలన సాగిస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం నాయుడుపేట మున్సిపాలిటీలోని మునిరత్నం నగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. వంద రోజుల్లో చేపట్టిన ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, నాయకులు కొండలరావు, విజయభాస్కర్ రెడ్డి, షేక్ రఫీ, ప్రవీణ్, గంగా ప్రసాద్, రాజశేఖర్, మణి, సుధీర్, బాబు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి అంచనాలు

ప్రజాశక్తి-కోట: మండలంలోని చెందోడు పంచాయితీలో కొత్తపాలెంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి గురువారం పంచాయతీ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసినట్లు టీడీపీ నాయకులు రఘురామ్ తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉందని ఆ మేరకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఏఈ కిరణ్, నాయకులు బాల సుబ్రమణ్యం, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలి: సీపీఐ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని స్టేషన్ మాస్టర్‌కు సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మరమ్మతుకు నోచుకోని కాలువ

జెండా మాను వీధిలో మరమ్మతులకు గురైన కాలువ

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని జండా మాను వీధి, జ్ఞాన జ్యోతి, శ్రీ చైతన్య, స్కూల్ వెళ్లే దారిలో వున్న కాలువ పూర్తిగా దెబ్బతింది. తేలికపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నాయి. కొంత మురుగు కాలువలోనే పేరుకుపోయి ఉండడంతో దుర్గంధమైన వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై నీరు ప్రవహించకుండా మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గతంలో మునిసిపాలిటీ అధికారులు కాలువ తవ్వి నిర్మాణం చేపట్టడం మరిచారని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల పరిసర ప్రాంతాల్లో స్కూల్ పిల్లలకి, నివాసమున్న ప్రజలకి ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం


జాతరలో ఎమ్మెల్యే కురుగొండ్ల

- వీఐపీల పాస్లు లేవంటూనే వేలాదిగా తరలివచ్చిన వీఐపీలు

- సామాన్య భక్తులు అవస్థల పాలు

ప్రజాశక్తి- వెంకటగిరి, డక్కిలి: వెంకటగిరిలో జరిగిన పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జాతరను నిర్వహించారు. ముందుగా చాకలి మండపంలో అమ్మవారి ప్రతిమకు పసుపు కుంకుమలతో సారె సమర్పించారు. శోభా యాత్రలో భాగంగా ప్రత్యేక రథంపై అమ్మవారిని ఆలయానికి అమ్మవారిని తీసుకొచ్చారు. ప్రత్యేక పూల రథంలో అమ్మవారి శోభా యాత్ర : వెంకటగిరి పోలేరమ్మ జాతరలో కీలక ఘట్టమైన అమ్మవారి విగ్రహం తయారీ బుధవారం సాయంత్రానికి పూర్తయింది. అమ్మ పుట్టినిల్లయిన కుమ్మరివీధిలోని కుమ్మరింట అమ్మవారి ప్రతిమను తయారు చేశారు. కుమ్మరి కుటుంబీకులు పోలేరమ్మకు అమ్మగారి సాంగ్యం అందజేశారు. రాజులు సమర్పించిన పట్టుచీరను అమ్మవారికి అలంకరించారు. విగ్రహం తయారీ పూర్తయ్యాక అమ్మవారిని దర్శించుకునేందుకు ఉంచారు. ఇక్కడ వేలాది మంది భక్తులు పోలేరమ్మను దర్శించుకు న్నారు. పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దుర్గేశ్ : గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత పోలేరమ్మను మెట్టినిల్లైన చాకలింటికి తీసుకు వెళ్లి అక్కడ కళ్లు, దిష్టిచుక్క ఏర్పాటు చేసి కిలారింపులు, దివిటీ వెలుగులు, యువకులు చిందులు మధ్యన అమ్మవారిని చప్పరంపై ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ భక్తుల దర్శనార్థం ఉంచారు. గురువారం సాయంత్రం వరకు భక్తులు పోలేరమ్మను దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బూసాతోటలో ప్రత్యేకంగా బాణసంచా కాల్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నేడు లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా చంద్రగిరి లోని రాయలకోటలో రూ. 6 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన లైట్ అండ్ సౌండ్ షో ను శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గత ప్రభుత్వంలో లైట్ అండ్ సౌండ్ షో మూతపడిపోవడంతో స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ దష్టికి తీసుకెళ్లి పర్యాటక శాఖ నుండి ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేయించి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్న రాయలకోటకు లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేయడానికి కషి చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి వి శేఖర్ నేతత్వంలో విద్యార్థులచే శుక్రవారం ఉదయం చంద్రగిరి టవర్ క్లాక్ నుండి రాయల్ కోట వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎస్ లలిత కుమారి తెలిపారు.

టిటిడి ఈవోను కలిసిన నందిని డెయిరీ ప్రతినిధులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (నందిని డైరీ) ప్రతినిధులు గురువారం టీటీడీ ఈవో జె.శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో కేఎంఎఫ్ ప్రతినిధులు నందిని డెయిరీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పిపిటి) ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో గౌతమి, కేఎంఎఫ్ ఎండి ఎంకె జగదీష్, డైరెక్టర్లు రఘునందన్, రాజశేఖర్ మూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆ సంఘం భవనంలో పేద బ్రాహ్మణులకు ఫలసరుకుల పంపిణీ చేశారు. ఆలూరు శిరోమణి శర్మ, గూడూరు రిటైర్డ్ పోస్టల్ సూపరింటెండెంట్ కనుమెల సుబ్బారావు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శివ కుమార్, శ్రీనివాసరావు, పురుషోత్తమరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, రాజా, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ వంకీ పెంచలయ్య అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు ప్రేరణ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూజా బాలి హాజరైయ్యారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కళాశాల ఛైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థులు నూతన అవిష్కరణలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించు కోవాలన్నారు. సులువైన పద్ధతుల్లో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణు మాధవ్, రాజయ్య, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని మినీ గురుకులంలో శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, మయూరి శ్యామ్ యాదవ్ విద్యార్థులకు సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. జన్మదినం జరుపుకుంటున్న 5మంది విద్యార్థినుల చేత భారీ కేక్‌ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో జరిగిన కోకో క్రీడలో జిల్లాకు ఎంపికైన ముగ్గురు విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ మేరీ ప్రియత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీటీగా అన్వర్ బాషా బాధ్యతలు స్వీకరణ

అన్వర్ బాషా

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండల రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్‌గా ఎం.అన్వర్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. చిన్నగొట్టిగల్లులో డీటీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ పునితారాణి శ్రీకాళహస్తి ఆర్‌డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అదేవిధంగా మండల సర్వేయర్‌గా రమేష్‌బాబు నియమితులు కాగా ఇక్కడ పనిచేస్తున్న హేమకుమార్ తిరుపతి రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన డీటీ, సర్వేయర్‌లకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వోలు ప్రసాద్, నాగజ్యోతి, సిద్దయ్య, ఝాన్సీ రాణి, బాబు, చిరంజీవి, సాయి, బాబు ఖాన్ పాల్గొన్నారు.

'దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం'

ప్రజాశక్తి-రామచంద్రాపురం:

అక్టోబర్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవా లను విజయవంతం చేద్దామని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రతాప్‌స్వామి పిలుపునిచ్చారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సన్మానం

హెచ్‌ఎం మమతను సన్మానిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: తిరుపతిలోని బాబు జగజ్జీవన్ రామ్ భవనంలో ఈనెల 22వ తేదీ జరిగిన ఏపిటీఎఫ్ 80 వసంతాల వేడుకలో మండలంలోని సముదాయం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం మమత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గురువారం మమతను పలువురు పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పాఠశాల ఛైర్మన్ వెంకటేష్, అంగనవాడి టీచర్ హేమలత, సహాయకురాలు రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: వ్యవసాయానికి ప్రభుత్వ పరంగా పెట్టుబడి సాయం అందించాలని, రూ.20వేలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్య క్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సజ్జలకు మద్దతు ధరను ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు కేం ద్రా లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. సమా వేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా నాయకులు రాజేశ్వరి, మునీశ్వరి, జ్ఞానమ్మ, భార్గవి, సరళ, రామయ్య, శంకరయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రిన్సిపల్ అభినందనలు

ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎన్‌సీసీ విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతాయని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. గురువారం ఎన్‌సిసిలో ప్రవేశం పొందిన 34మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సిసిలో శిక్షణ పొందడం ద్వారా సామాజిక సేవ, జాతీయభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. శిక్షణ పొందిన వారికి ఆర్మీ, నావీ, ఎయిర్ ఫోర్స్, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్‌తో పోటు పోలీసు శాఖల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కోఆర్డినే టర్ డాక్టర్ శ్రీనివాసలు, 29 ఆంధ్ర బెటాలియన్ తిరుపతికి చెందిన సుబేదార్ బిమల్ మింజ్, సివిల్ దార్ శివరాజ్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు. విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పశువైద్య కళాశాలలో

చిన్నగొట్టిగల్లులో

- అసోసియేట్ డీన్ జగపతి రామయ్య

ప్రజాశక్తి-క్యాంపస్: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్వీ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ ఆచార్య జగపతి రామయ్య పిలుపునిచ్చారు. స్వచ్ఛత సాహి కార్యక్రమంలో భాగంగా పశువైద్య కళాశాలలో విద్యార్థుల చేత కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, జర్నలిజం విభాగాల్లోని ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థినులు సంయుక్తంగా శ్రమదానం చేసారు. కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజని, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య వాణి పర్యవేక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని తిరుపతి రూరల్ ఎంఈఓ దేవరాజుల రెడ్డి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-14 ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామం ఎంపీపీ స్కూల్లో వ్యక్తిగత అవగాహన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.నాగమణి, ప్రతిమ, వజిహాబాను, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జునియర్ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ గుండ్లూరు నాగరాణి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పీఓవై రవీంద్రతో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణం, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.సునంద, సి.హరి, మల్ రెడ్డి, ఆంజనేయులు, నాగభూషణం, సుజాత, హేమలత, పూర్ణచంద్రిక పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభోత్సవంలో రిషిత

పూజా కార్యక్రమాల్లో రిషితా రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జుంలేషా పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉరుసు కమిటీ నిర్వాహకులు ఆమెకు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రిషితా ఉరుసు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులకు సత్కారం

ఫార్మాసిస్టులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజలకు ఫార్మాసిస్టులు చేస్తున్న సేవలకు గుర్తుగా శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫార్మసిస్టులను గురువారం ఘనంగా సత్కరించారు. ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. తిరుపతి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ రాము, శ్రీకాళహస్తి అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావు, సెక్రటరీ గోపాల్, ట్రెజరర్ కార్తీక్ రెడ్డి, సీనియర్ ఫార్మసీస్ట్ అమరా జనార్ధన్, ఆనంద్ గుప్తా, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ పిడియాట్రిక్స్‌లో హెల్త్‌క్యాంప్ సక్సెస్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం తిరుపతి రూరల్ శెట్టిపల్లి గ్రామం జడ్‌పి ప్రైమరీ స్కూల్లో హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. పిడియాట్రిక్స్ విభాగాధిపతి పునీత్ మాట్లాడుతూ క్యాంపులో 60 మంది పిల్లలకు పరీక్షలు చేసి, కొంతమందికి జబ్బులను గురించి వారి తల్లిండ్రులతో మాట్లాడి సూచనలు ఇచ్చామన్నారు. ఈ తరహా క్యాంపు ప్రతి నెలా స్విమ్స్‌వారు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిస్టర్ పద్మజ, స్టాఫ్ నర్సు సుకన్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని కలకత్తా- చెన్నై జాతీయ రహదారి నెలబల్లి గ్రామ సమీపం వద్ద గురువారం గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. ఇతను ఎవరో! ఏ ప్రాంతానికి చెందిన వాడు గుర్తించే ఆనవాళ్లు కనిపించలేదు. పోలీసులు మాత్రం మతిస్థిమితం లేని వ్యక్తిగా, ఇటీవల ఆ ప్రాంతంలోనే సంచరిస్తూ అనారోగ్యంతోను, ఆకలి బాధతోను లేవ లేని స్థితిలో ఊపిరాడక చనిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Before The V Addl. Motor Accidents Claims Tribunal : Nellore

M.V.O.P.No. 386 / 2023

Potluri Srinivasulu alias
Potluru Seenaiah - Claimant

Vs

1. VRL Logistics Ltd.,
rep.by **P.V.Ramana Rao**
and 2 others - Respondents

Notice

To,
R3. Mutyala Sridhar, S/o **Gopi Krishna,** Driver of the Lorry Bearing No.AP-29-T-9808, residing at 2-153-2, Vakadu Village and Mandal, SPSR Nellore District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే01-10-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సి.భాస్కర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In The Court Of The Senior Civil Judge : Gudur

I.P.No. 9 / 2024

Sriram Ravi - Petitoner

Vs

1. Chokka Venkataramanaiah
2. Kokalla Audiseshaiah
3. Ega Budevamma
4. Konduru Balaji
5. Nalajam Kiran
6. Poluru Ankamma
7. Gedi Jayaprakash
8. Palleti Kavitha
9. Gonupalli Kistaiah
10. Nanimela Varalakshmi
11. Duppala Ravanaiah
12. Iragaraju Rathnaiah
13. Kokollu Venkatamma
14. Ketham Ramadevi
15. Sk.Siroj - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై వారి కోర్టులో **I.P. No.9/2024** పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల **తే 15-10-2024 ది** న వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

బోమిడి సంజీవయ్య, బి.ఎ., బి.ఎల్.,
వై.సురేష్, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
పిటిషనరు తరపు అడ్వకేట్స్, గూడూరు.